# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## నీట్ రాష్ట్ర ర్యాంకులో గిరిజన విద్యార్థిని ప్రతిభ

ఉట్నూరు : నీట్ తెలంగాణ రాష్ట్ర ర్యాంకులలో ఉట్నూరుకు చెందిన గిరిజన ఉపాధ్యాయుడు పవార్ విజయ్‌కుమార్, నేహ దంపతుల కుమార్తె హర్షిత ప్రతిభచాటింది. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించిన నీట్ రాష్ట్ర ర్యాంకులలో ఎస్టీ విభాగంలో హర్షిత రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకును సాధించడం విశేషం. అదే విధంగా జనరల్ క్యాటగిరిలో 246 ర్యాంకును పొందింది. ఇంటర్మీడియట్ బైపీసీలో వెయ్యి మార్కులకుగాను 979 మార్కులు సాధించడంతోపాటు రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకును సొంతం చేసుకుంది. పదో తరగతిలో 10జీపీఏను దక్కించుకుంది. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థిని చదువుల్లో రాణించడం పట్ల ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. స్త్రీవైద్యనిపుణురాలిగా ఎదిగి పేదలకు వైద్యసేవలు అందించడమే తన లక్ష్యమని హర్షిత తన అభిప్రాయాన్ని తెలిపారు.

## రైతులకు పంట బీమా చెల్లించాలి

### కిసాన్‌సంఘ్ జాతీయకార్యదర్శి కె.సాయిరెడ్డి



ఇచ్చోడ : రైతులకు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పంటబీమా చెల్లింపులు తక్షణమే చేయాలని కిసాన్‌సంఘ్ జాతీయ కార్యదర్శి కె.సాయిరెడ్డి డిమాండు చేశారు. ఆయన అఖిల భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. గతేడాది వేసిన పత్తి, సోయా, పెసర, మినప పంటలకు రైతులు బీమా చేసినా ఇప్పటి వరకు డబ్బులు రాలేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో అన్నదాతలు అప్పుల పాలు కావాల్సి వస్తుందని పేర్కొన్నారు. గతేడాది అధిక వర్షాల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు. వ్యవసాయ అధికారులు, బీమా కంపెనీల వారు నష్టపరిహారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధరించారని అన్నారు. ఒక ఇచ్చోడ మండలం లోనే 400 మంది రైతులు ఫసల్ బీమా చేసుకున్నారని తెలిపారు. బీమా కంపెనీలకు ప్రభుత్వ వాటాను చెల్లించి తక్షణమే పరిహారం విడుదలయ్యే చూడాలని కోరారు. నిరసన ర్యాలీ స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి జాతీయరహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్‌తో పాటు వ్యవసాయాధికారి సాగరికకు పంటబీమా చెల్లింపులపై వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పాన్‌పట్టె మారుతి, రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్ సంగెపు బొర్రన్న, గడ్డం రాజారెడ్డి, కల్లెం సతీష్‌రెడ్డి, వేణుగోపాల్, గజానంద్, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు సత్వరం పరిష్కరించాలి

### పాలనాధికారి వెంకటరామరెడ్డి

సిద్దిపేట : ప్రజావాణి వినతులు, ఫిర్యాదులపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని పాలనాధికారి వెంకటరామరెడ్డి అధికారులను ఆదేశించారు. సిద్దిపేటలో జరిగిన ప్రజావాణిలో 48 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శాఖలకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉండకుండా శాఖాధిపతులు నిరంతరం సమీక్షించాలన్నారు. నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తేనే ప్రజలకు మరింత నమ్మకం కలుగుతుందన్నారు. సంయుక్త పాలనాధికారి పద్మాకర్, డీఆర్వో చంద్రశేఖర్, వివిధ శాఖాధిపతులు ప్రజావాణిలో పాల్గొన్నారు.

రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో జిల్లా ముందంజలో ఉందని పాలనాధికారి వెంకటరామరెడ్డి తెలిపారు. సిద్దిపేటలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఎస్.ఎస్.ఇన్‌ఫ్రా కంపెనీ ప్రతినిధులతో ఈ అంశంపై సమీక్ష జరిపారు.

జిల్లాలో 800 ఇళ్ల నిర్మాణం చేపట్టే బాధ్యత ఎస్.ఎస్.ఇన్‌ఫ్రా కంపెనీకి అప్పగిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో విశిష్ట అనుభవం ఉన్న ఈ సంస్థను జిల్లాలో రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరగా ముందుకు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కంపెనీ భాగస్వాములు శేఖర్‌రాజు, మోహన్‌రాజు మాట్లాడుతూ...రెండు వారాల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. సమీక్షలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ రాజశేఖర్, ఆర్డీఓ ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : నేటి సమాజానికి, యువతరానికి అధ్యాత్మిక జ్ఞానం ఎంతో అవసరముందని వరంగల్ జిల్లా శ్రీ జగద్గురు గీతాశ్రమ వ్యవస్థాపకులు శ్రీ జ్ఞాన చైతన్యానందస్వామీజీ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో అధ్యాత్మిక జ్ఞాన సత్సంగం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక రామాయణం-శ్రీ సీతారామాంజనేయ సంవాదంపై ప్రవచనాలను వినిపించారు. ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందినపుడు ఆత్మ పరమార్థం అవగతమవుతుందన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఛైర్మన్ కర్నాటి పాండు, బల్ల దుర్వాసులు, గుర్రం కృష్ణ, మాచర్ల కృష్ణానంద పాల్గొన్నారు.

## కవ్వాల్‌లో వింతజీవంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్

జన్నారం: కవ్వాల్ అటవీ ప్రాంతంలో వింత జీవి సీసీ కెమెరాలో చిక్కినట్లుగా సామాజిక మాధ్యమాల్లో అలజడి సృష్టించడంతో ఒక్కసారిగా ప్రజలు ఆందోళన చెందారు. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు.. ఏ ప్రాంతంలో సీసీ కెమెరాకు చిక్కిందో తెలియదు.. ఇంతకీ అది పోస్టు చేసిందేవెరో అంతకంటే తెలియదు. కానీ మంచిర్యాల జిల్లా కవ్వాల్ అటవీ ప్రాంతంలో చిక్కిందటూ పుకార్లు రావడంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల వారు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు, అటవీశాఖ అధికారులకు సైతం ఫోన్లు చేసి వాకబు చేస్తున్నారు. ఇది తప్పుడు సమాచారం అని వదంతులను నమ్మొద్దని ప్రజలకు అటవీ అధికారులు తెలిపారు. నిజానికి అటవీ ప్రాంతంలో అమర్చిన సీసీ కెమెరాకు ఏ జంతువు చిక్కిన ఆ శాఖ రేంజి అధికారి, డీఎఫ్ఓకు సమాచారం ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటి దాఖలాలు ఏమీ లేకపోవడంతో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంపై మంచిర్యాల డీఎఫ్ఓ ప్రభాకర్ న్యూస్‌టుడేతో మాట్లాడుతూ ఎలాంటి వింత జీవి కవ్వాల్ అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాకు చిక్కినట్లుగా సమాచారం లేదు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మాల్సిన అవసరం లేదని సమాధానం ఇచ్చారు.

## గిరిజనులకు న్యాయం చేయాలి


ఎదులాపురం : గిరిజన రైతుల పట్ల ఈ ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తిస్తోందని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి రవికుమార్ విమర్శించారు. సోమవారం స్థానిక సుందరయ్యభవన్‌లో గిరిజన రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారు గత దశాబ్దాల కాలంగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూములకు అటవీ హక్కు పత్రాలు అందించడంతో పాటు పంట రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇది వరకే అటవీ హక్కుపత్రాలు ఇచ్చిన భూముల్లో అటవీ శాఖ వారు హరితహారం పేరుతో మొక్కలు నాటి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అంతే ఇప్పటికే పలు గిరిజన గ్రామాల్లో అంటువ్యాధులు సోకి అనారోగ్యాల బారిన పడుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందించడానికి ఆరోగ్య అత్యయికస్థితి (హెల్త్ ఎమర్జన్సీ) ప్రకటించాలన్నారు. గిరిజన గ్రామాలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో గిరిజనులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీంరావు, జిల్లా అధ్యక్షుడు కనక గణపతి పాల్గొన్నారు.

## బిచ్చగాళ్ల దాడిలో గాయపడిన ఆర్టీసీ పారిశుధ్య కార్మికులు

కుడకుడరోడ్డు : సూర్యాపేట పట్టణంలోని కొత్తబస్టాండులో బిచ్చగాళ్లు ఆర్టీసీ పారిశుధ్య కార్మికులపై దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తబస్టాండులో బిచ్చగాళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారని ఒప్పంద ఆర్టీసీ పారిశుధ్య కార్మికులు వాళ్లను బస్టాండు నుంచి బయటికి పంపించే క్రమంలో బిచ్చగాళ్లు (ఇద్దరు మహిళలు) ఆర్టీసీ పారిశుధ్య కార్మికులపై దాడికి పాల్పడ్డారు. దీంతో ముగ్గురు పారిశుధ్య కార్మికులకు గాయాలైనాయి. గాయాలైన వంగపల్లి ఎల్లమ్మ, దుర్గం లక్ష్మమ్మ, ములగలేటి ఎల్లమ్మను ఆర్టీసీ సిబ్బంది ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి.. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. పట్టణ ఎస్సై జానకిరాములు సంఘటన స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

## ముగిసిన ఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్

### 840 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



బెల్లంపల్లి : తెలంగాణ రాష్ట్ర సాంకేతిక ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఈసెట్-2017 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గత నెల 30 నుంచి ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ముగిసింది. చివరి రోజు 9 గంటల నుంచి సాయంత్రం వరకు నాలుగు విడతల్లో 16,001వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగింది. నాలుగు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 840 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ బి.కరుణ కుమార్ తెలిపారు.

ధ్రువపత్రాలను బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖాధికారులు, కళాశాల సిబ్బంది పరిశీలించారు. ఈ నెల 5వ తేదీ వరకు కోర్సుల ఆప్షన్లు ఎంపిక చేసుకునే అవకాశం ఉందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. 7వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

## దుకాణాల్లో రేషన్ బియ్యం దాడులు చేసి పట్టుకున్న అధికారులు





గద్వాల : గద్వాలలోని శ్రీమణికంఠ అగ్రో ఇండస్ట్రీస్(పాండు రైస్‌మిల్)లో గతనెల 26న 339.78 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్‌చేసిన కేసులో నిందితుల వివరాలను గద్వాల పట్టణ ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో కొంతమంది బియ్యం వ్యాపారులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని పట్టణంలో బియ్యం వ్యాపారం చేస్తున్న నాయకీ శంకర్, వెంకటస్వామి, దౌదర్‌పల్లి షరీఫ్, తిప్పయ్య శెట్టి, ఇనూస్, యూసూఫ్, తిప్పన్న, శీల రాములు, శంకరయ్య, భాస్కర్ శెట్టి, కారబండి ఆంజనేయులు చుట్టుపక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారని చెప్పారు. బండి దౌలన్న, బండి ఆంజనేయులు ఈ బియ్యాన్ని పాండు రైస్‌మిల్‌లో రీపాలీషింగ్ చేయించి సోనా బియ్యంగా మారుస్తున్నారని చెప్పారు. అదే బియ్యాన్ని దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కేసులో రైస్‌మిల్ యజమాని పాండుని గతనెలలో అరెస్టు చేశామన్నారు. అందిన సమాచారంతో ఉదయం తుల్జారాం ఆలయం వద్ద ఉన్న బియ్యం దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించామన్నారు. నిల్వ ఉన్న 12 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. ఈ కేసులో ఏడుగురిని రిమాండ్ చేశామన్నారు. అయితే ఈ కేసులో ముఖ్య సూత్రదారి అయిన పాండును అరెస్టు చేసినప్పుడు పోలీసులు ప్రకటించకపోవటం, మధ్యవర్తులుగా ఉన్న బండి దౌలన్న, బండి ఆంజనేయులును అరెస్టు చేసి ప్రకటించటంపై విమర్శలు వచ్చాయి. ఈ విషయంపై పట్టణ ఎస్సైని న్యూస్‌టుడే వివరణ కోరగా ఎలాంటి సందేహాలు అవసరం లేదని, పాండును అరెస్టు చేసినప్పుడు సమయంలేక వివరించలేక పోయామని తెలిపారు. దుకాణాల్లో చేసిన దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ ఖాజాదౌలత్, ఆర్ఐ అజిత్‌కుమార్, పట్టణ ఠాణా ఎస్సైలు శ్రీనివాస్, మధుసుధన్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై మహేందర్, పోలీసులు పాల్గొన్నారు.

## పాలమూరుకు ఆధ్యాత్మిక శోభ

### తొలి ఏకాదశికి ఆలయాల ముస్తాబు



మహబూబ్‌నగర్ : వెంటవెంటనే రానున్న పర్వదినాలతో జిల్లాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది.. ఆలయాల్లో భక్తుల సందడి కనిపించనుంది. ఇంటింటా పవిత్రమైన ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. ఏడాదిలో 24 ఏకాదశుల్లో మొదటిసారిగా వచ్చే ఏకాదశిని హిందువులు అత్యంత శ్రేష్ఠమైన రోజుగా భావిస్తారు. తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలతో భగవంతుడిని పూజిస్తారు. ప్రధానంగా ఈరోజున గోపద్మవ్రతం నిర్వహిస్తే పుణ్యఫలాలు పొందుతారని పురాణాల్లో ఉంది. ఆషాఢం, శ్రావణం, ఆశ్వయుజం, కార్తీకం ఈ నాలుగు మాసాలపాటు చాతుర్మాస్యవ్రతాలు అవలంబిస్తారు.వైష్ణవాలయాల్లో తొలి ఏకాదశి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్‌లోని కంచికామకోటి పీఠం పిల్లలమర్రి దారిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజరు తోటపల్లి శ్రీకాంతశర్మ వెల్లడించారు. ఉదయం 5.30 గంటల నుంచి సుప్రభాతసేవ, స్వామివారికి పూలంగి సేవ, సహస్రనామార్చన, అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని తెలిపారు. సింహగిరి శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో తగిన ఏర్పాట్లు చేశారు. టీడీగుట్టలోని తిరుమలనాథ స్వామి దేవాలయం, తితిదే కల్యాణ మండపంలో, శ్రీనివాస కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, హౌసింగ్‌బోర్డు కాలనీలోని దేవాలయంలో తొలి ఏకాదశి విశేష పూజలు నిర్వహించనున్నారు. అలాగే పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో కూడ ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తారు.

## గ్రీవెన్స్‌లో సామాన్యుల మనోవేదన

### పొరుగు సేవల వారికి ఈఎస్ఐ, పీఎఫ్ అమలుచేయాలన్న కలెక్టర్



ఖమ్మం : వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాలు ప్రతి నెల నిర్వహించాలని, సంబంధిత ఏజెన్సీలు ఉద్యోగుల ఖాతాల్లో ప్రతి నెల పీఎఫ్, ఈఎస్ఐ తమ వాటా సొమ్ము జమచేయాలని కలెక్టర్ లోకేశ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొరుగు సేవల ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో ప్రతి నెల ఏజెన్సీల వాటా సొమ్ము జమ అయ్యిందీ? లేనిదీ ఆయా శాఖల అధికారులు తనిఖీ చేయాలన్నారు. సొమ్ము జమ చేయని ఏజెన్సీని గుర్తిస్తే మరుసటి నెలకు బిల్లులు నిలిపివేయాలని ఆదేశించారు. ఇకనుంచి అత్యధిక సెక్యూరిటీ డిపాజిట్ జమ చేసేందుకు ముందుకొచ్చిన ఏజెన్సీలకే పొరుగు సేవల ఉద్యోగులను కేటాయించాలన్నారు. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు పొరుగు సేవల ఉద్యోగులను ఎంపిక చేసి వారిని ఏజెన్సీకి అప్పగించాలే తప్ప.. ఎంపికలో వారి ప్రమేయాన్ని పెంచొద్దన్నారు. అనంతరం ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించిన కలెక్టర్.. సంబంధిత శాఖల అధికారులకు అప్పగించారు. ఈ వారం చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా సచివాలయానికి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. తమ మనోవేదనను తెలిపారు. గ్రీవెన్స్‌డేలో జేసీ వినయ్‌కృష్ణారెడ్డి, డీఆర్వో శివశ్రీనివాస్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టం ఎక్కడా అమలు జరగటంలేదని, గ్రామాల్లో కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు వేదగిరి శ్రీనివాసరావు, కె.నర్సయ్య, పొన్నెకంటి సంగయ్య, వీరస్వామి వినతి పత్రం అందించారు.

ఖమ్మం కవిరాజ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా మనీ ల్యాండరింగ్, ఫైనాన్స్ వ్యాపారం సాగిస్తున్నారని.. వేర్వేరు పేర్లతో వాహనాలకు ఫైనాన్స్ చేస్తూ అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేయడంతో పాటు ఖాళీ చెక్కులు, ప్రాంసరీ నోట్లను తీసుకుని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని నగరానికి చెందిన చిన్న రామలింగయ్య కలెక్టర్‌కు విన్నవించారు.

కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలోని 258 సహా పలు సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ డొంక దారిని ఆక్రమణదారుల నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారని, దీనికి ఇరువైపులా హరితహారంలో మొక్కలు నాటేందుకు అనుమతించి రక్షణ కల్పించాలని రైతులు డి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు, రామారావు, సోందుసాహెబ్, సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు విన్నవించారు.

తిరుమలాయపాలెం మండలంలో కాకరవాయి, ముజాహిద్‌పురం, సుద్దవాగుతండా గ్రామాల నుంచి వెళుతున్న పాలేరు వాగు నుంచి నిరంతరాయంగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని, నకిలీ కూపన్లతో సాగుతున్న దందాను అరికట్టాలని పాచ్యానాయక్, కిషన్, రమేశ్, మోహన్ తదితరులు ఫిర్యాదు చేశారు.

తల్లాడ మండలం గోపాల్‌పేటలో ఓ మహిళకు భూమి లేకున్నా ఆమెకు ఆరు ఎకరాలున్నట్లు పహాణీ నకలు జారీచేశారని, దాని ఆధారంగా ఆమె బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకున్నారని, బాలపేట రెవెన్యూలోనూ తప్పుడు పత్రాలతో భూముల పట్టాలు మార్పిడి చేసినందున విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అన్నారుగూడెంకు చెందిన టి.యుగంధర్ ఫిర్యాదు చేశారు.

తన భర్త శ్రీనివాస్ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ గుండెపోటుతో నాలుగేళ్ల క్రితం మరణించారని, ఆపద్బంధు ఆర్థిక సాయం మంజూరు చేయాలని సింగరేణి మండలం పేరుపల్లికి చెందిన ఆకులపాటి ఉమ కోరారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

పూట్కూరు: విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు వేళకు నడపాలని డిమాండ్ చేస్తూ పూట్కూరు చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు భరత్, ఉత్తేజ్ మట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులు వేళలకు రాకపోవడం వల్ల తాము కళాశాలలు, పాఠశాలలకు సకాలంలో చేరలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు ఆలస్యంగా రావటం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఆర్టీసీ అధికారులు వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని వారు బైఠాయించడంతో రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై విజయ్‌కుమార్ అక్కడికి చేరుకొని ఆర్టీసీ అధికారులను అక్కడికి పిలిపించి మాట్లాడారు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుశీల మాట్లాడుతూ.. బస్సుల కొరత కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యార్థులను సకాలంలో చేరవేసేలా బస్సు వేళల్ని మారుస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజీవ్, మహేష్, శరత్, నీల్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వసతిగృహాన్ని జిల్లాకేంద్రానికి తరలించాలి

### ఏఐఎస్ఎఫ్

ఆదిలాబాద్ : ఇచ్చోడలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లాకేంద్రానికి తరలించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వారంతా పాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లాకేంద్రంలో ఇంటర్, డిగ్రీలతో పాటు పాలిటెక్నిక్, పారా మెడికల్ డిప్లొమా విద్యార్థినులకు ఒకే ఒక వసతిగృహం ఉందని, అక్కడ సీట్లు సరిపోక ప్రైవేటు వసతిగృహాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మేస్రం భాస్కర్ పేర్కొన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని వసతిగృహాన్ని జిల్లాకేంద్రానికి తరలిస్తే విద్యార్థినులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. పాలనాధికారిని కలిసిన వారిలో నాయకులు అశోక్, నవీన్, మహేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరణ



వడ్డేపల్లి: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా వరంగల్ అర్బన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) కె.శోభ పలు ఫిర్యాదులు స్వీకరించారు. కమలాపూర్ మండల కేంద్రంలో మొదటిసారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలితోపాటు జిల్లాసంయుక్త కలెక్టర్ ఎస్.దయానంద్, ఆర్డీవో వెంకారెడ్డిలతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు తరలివెళ్లారు.

దీంతో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్వో ఒక్కరే ఫిర్యాదులను స్వీకరించారు. వృద్ధులు తమకు పింఛన్ రావడం లేదని, వికలాంగులు తమకు సదరం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. భట్టుపల్లి గ్రామానికి చెందిన స్థానికులు రోడ్డు విస్త రణలో భాగంగా స్థలం కోల్పో యామని పరిహారం ఇస్తామని కొలతలు తీసుకెళ్లారని ఇంత వరకు తమకు ఇవ్వలేదన్నారు. తాము గతంలో కలెక్టర్‌ను కలిసి విన్నవించామని చెప్పారు. డీఆర్వో భట్టుపల్లి రోడ్డు విస్తరణ చేపట్టిన ఆర్అండ్‌బీ శాఖ నుంచి ప్రజావాణికి హాజరయ్యేందుకు వచ్చిన ఉద్యోగిని వివరణ అడిగారు.

తాము రెవెన్యూ శాఖకు డబ్బులు చెల్లించామని చెప్పడంతో డీఆర్వో కె.శోభ వెంటనే ఆర్డీవో వెంకా రెడ్డితో మాట్లాడి వీరికి పరిహారం ఇవ్వడంలో జాప్య మెందుకు జరుగుతుందని అడిగి తెలుసు కున్నారు.

పరిహారం చెల్లించ డానికి ప్రభుత్వపరంగా చేపట్ట వలసిన ప్రక్రియ చేపట్టామని నెల రోజుల్లో పరిహారం అందేవి ధంగా కృషి చేస్తామని చెప్పారు. నగరంతోపాటు అర్బన్ జిల్లా పరిధిలోని సమస్యలపై సుమారు 80కి పైగా ఫిర్యాదులు అందాయి. పజావాణిలో డీఆర్‌వోతోపాటు పలు పభుత్వ శాఖలకు చెందిన సీనియర్ సహాయకులు, సూపరింటెండెంట్‌లు హాజరయ్యారు.

## అంకుర ఆసుపత్రికి మంత్రి ప్రారంభోత్సవం

ఖమ్మం : ఖమ్మం బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన స్త్రీ, పిల్లల ప్రత్యేక వైద్య సేవల ఆసుపత్రి అంకురను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. మహా నగరాల స్థాయిలో అధునాతన టెక్నాలజీతో ఆసుపత్రిని ప్రారంభించడం అభినందనీయ మన్నారు. శాసనసభ్యుడు పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ స్త్రీల విభాగంలో నాణ్య మైన సేవలు అందించి ప్రజల అభిమానం చూరగొనాలన్నారు. కార్యక్రమంలో అంకుర ఆసుపత్రి ఎండీ కృష్ణప్రసాదరావు, డాక్టర్ శ్రీనిధి, వైద్య నిపుణులు డా.వెన్నెల, సభిత, సురేఖ, సతీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# గూడులేని నిరుపేదల కోసమే ఇళ్లు

### - కలెక్టర్ ఆమ్రపాలి

## సిద్ధాపూర్‌లో రెండు పడక గదుల ఇళ్లకు శంకుస్థాపన



సిద్ధాపూర్ : హసన్‌పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామంలో రెండు పడక గదుల ఇళ్లకు కలెక్టర్ కాట ఆమ్రపాలి, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ కాట ఆమ్రపాలి మాట్లాడుతూ గూడులేని నిరుపేదలను ఆదుకునేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే ఎక్కడలేని రీతిలో రెండు పడక గదుల ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు.రెండు పడక గదుల ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించేందుకు అధికారులు చొరవ చూపాలని సూచించారు. సిద్ధాపూర్‌లో ప్రభుత్వ భూమి కావాల్సినంత ఉన్నందున మరిన్ని రెండు పడక గదుల ఇళ్లను నిర్మించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సిద్ధాపూర్, అర్వపల్లి గ్రామాల్లోని అర్హులైన పేదలకు ఈ ఇళ్లు అందుతాయన్నారు.

ఈ సందర్భంగా పలువురు యువకులు తమకు ఉపాధిని కల్పించాలని కలెక్టర్‌ను వేడుకోగా తక్షణమే స్పందించిన కలెక్టర్ సిద్ధాపూర్, అర్వపల్లి గ్రామానికి చెందిన నిరుద్యోగులందరూ కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్‌సెల్‌లో వినతి పత్రం అందించాలన్నారు. వరంగల్, హైదరాబాద్ నగరాల్లోని ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వరంగల్ నగరంలో జాబ్‌మేళాను ఏర్పాటు చేసి వరంగల్, హైదరాబాద్ నగరాల్లో ఉద్యోగాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.అనంతరం ఎమ్మెల్యే అరూరి రమేశ్ వర్ధన్నపేట నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు పడక గదుల పథకం అందేలా చూస్తానన్నారు. నియోజకవర్గానికి మొత్తం 14వేల 742 ఇళ్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగానికి పెద్ద పీఠ వేస్తుందన్నారు. సిద్ధాపూర్ పీహెచ్‌సీలో త్వరలోనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. వర్ధన్నపేట నియోజక వర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సిద్ధాపూర్ గ్రామ సర్పంచి గడ్డం ఈశ్వరమ్మ, అర్వపల్లి ఎంపీటీసీ సభ్యులు జక్కు స్వాతి కలెక్టర్‌ను సన్మానించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ దయానంద్, 57వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, హసన్‌పర్తి ఎంపీపీ సుకన్య, వైస్ ఎంపీపీ కిరణ్, జడ్పీటీసీ సభ్యులు కె.సుభాశ్‌గౌడ్, అర్వపల్లి గ్రామ సర్పంచి బైరగాని వెంకులు, హసన్‌పర్తి తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో శ్రీవాణి, తెరాస నాయకులు జక్కు రమేశ్‌గౌడ్, కందుకూరి చంద్రమోహన్, చల్ల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వపక్షమే విపక్షమై..

వరంగల్ : మహా నగరపాలక సంస్థ పాలకవర్గంలో ఎలాంటి అసంతృప్తులు, గొడవలు లేవని మేయర్ నరేందర్ స్పష్టం చేశారు. 24 గంటలు గడవక ముందే అధికార పార్టీ కార్పొరేటర్లలో అసంతృప్తి బయట పడింది. జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం సాక్షిగా విభేదాలు భగ్గుమన్నాయి. స్వపక్షమే విపక్షమైంది. అధికార పక్షం సభ్యులే సమావేశాన్ని వాకౌట్ చేశారు. నగరంలోని 15 డివిజన్ కార్పొరేటర్ శారదా జోషి భర్త సురేశ్‌ను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్టు చేసిన తీరును తప్పుపట్టారు. అభివృద్ధి పనులు అడ్డుకున్నారనే కారణంతో కార్పొరేషన్ డీఈ కార్పొరేటర్ భర్తపై పోలీసులకు ఫిర్యాదు ఎలా చేస్తారు? ఇది ఎవరు చేయించారు? దీనికి కారణమైన ఇంజినీర్లను సరెండర్ చేయాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు నిలదీశారు. బాధ్యులపై చర్యలు తీసుకునేంతా వరకు సమావేశానికి వచ్చేది లేదని ఐదుగురు సభ్యులు వాకౌట్ చేసి బయటకు వెళ్లారు. వెంటనే మేయర్ నరేందర్ సభ్యులను శాంతిపజేశారు. అయినా విన్నలేదు. చివరకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి నేరుగా రంగంలోకి దిగారు. మేయర్ ఛాంబర్‌లో ఉన్న కార్పొరేటర్లతో ఫోన్లో మాట్లాడారు. పావు గంటలోనే సభ్యులు ఒక్కొక్కరుగా సమావేశ మందిరానికి వచ్చారు. వాయిదా పడుతుందనుకున్న సమావేశం రెండు గంటల పాటు కొనసాగింది. ఏజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో సభ్యులు వద్దిరాజు గణేశ్, దామోదర్‌యాదవ్, కవిత, మౌనిక, దేవేందర్, ఝాన్సీలక్ష్మి, కమిషనర్ శ్రుతి ఓజా, అదనపు కమిషనర్ షాహిద్ మసూద్, వింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహా నగరపాలక సంస్థ సాధారణ నిధుల్లో నుంచి సుమారు రూ.6కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నగరంలోని పలు డివిజన్లలో అత్యవసరంగా చేయాల్సిన పనులు, తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఆధునికీకరణ, విలీన గ్రామల్లో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు పనులకు పచ్చా జెండా వూపారు. ఉద్యోగుల పదోన్నతులను ఆమోదించారు.

# పోడు భూములకు పట్టాలివ్వాల్సిందే

### ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోటు రంగారావు



భద్రాచలం : పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. పోడు భూములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం మొక్కలు వేయడానికి సమాయత్తమవుతోందని, దీంతో ఆదివాసీల బతుకు పోతుందని దుయ్యబట్టారు. పోడు భూములకు పట్టాలివ్వాలంటూ భద్రాచలంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరజనులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో తెరాస ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి హరితహారం అడవుల రక్షణ పేరిట గిరిజనులకు, ఇతర పేదలకు జీవనాధారమైన పోడు భూములను స్వాధీనం చేసుకుంటోందన్నారు. ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా అటవీ అధికారుల ద్వారా దాడులు, దౌర్జన్యాలు జరిపిస్తుందని అన్నారు. అందుకే ఈ చర్యలను నిరసిస్తూ అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీల పోడు భూములకు పట్టాలివ్వాలని దాడులు, దౌర్జన్యాలు ఆపాలని డిమాండు చేస్తూ ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు.

హోరెత్తిన ధర్నా: ఆదివాసీలు ఎర్రజెండాలతో నిర్వహించిన భారీ ప్రదర్శన హోరెత్తించింది. సుమారు 2500 మంది గిరిజనులతో చేసిన ఈ ర్యాలీకి పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

మధ్యాహ్నం 12 గంటలకు పట్టణంలోని బ్రిడ్జి సెంటరు నుంచి భారీగా మొదలైన ప్రదర్శన అంబేద్కర్ సెంటర్ మీదుగా ఐటీడీఏకు చేరుకుంది. గేటు బైట ఆదివాసీలు బైటాయించి భారీ ధర్నాను నిర్వహించారు. సుమారు గంటసేపు ఐటీడీఏ కార్యాలయాన్ని ఆదివాసీలు ముట్టడించారు. అనంతరం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వేములపల్లి వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పంజాబ్ రాష్ట్ర సీపీఐ(ఎంఎల్) నాయకులు కట్కార్ తదితరులు ఆదివాసీల సమస్యలపై మాట్లాడారు.

అనంతరం ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావుకు ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఏపీవో తెలిపారు. ప్రదర్శనలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పట్టణ నాయకులు కెచ్చల కల్పన, కెచ్చల రంగారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో 31 శాతం పూర్తయిన నాట్లు

### - పత్తి, వరి, మొక్క జొన్న పంటలే అధికం -ఎరువుల భారంపై వీడని సందిగ్ధం

యాదాద్రి : ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. పదిహేను రోజులుగా అన్ని మండలాల్లో వానలు బాగా పడ్డాయి. దీంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గతేడాది పత్తి వద్దు.. అపరాలు సాగు చేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా విస్తృత ప్రచారం కల్పించింది. దీంతో రైతులు మెట్ట పంటలైన కంది, మొక్కజొన్న, పెసరలాంటి వాటిని సాగు చేశారు. జిల్లాలోని ఆలేరు, రాజపేట, వలిగొండ, చౌటుప్పల్, రామన్నపేట, భువనగిరి ప్రాంతాల్లోపాటు మెజారిటీ మండలాల్లో అధికంగా రైతులు వీటిని పండించారు. అపరాలకు బహిరంగ మార్కెట్టులో ఆశించిన మేరకు గిట్టుబాటు ధర లభించలేదు. చాలామంది రైతులు దళారులకు కందులను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో పత్తి ధర క్వింటాకు 5,500 పలికింది. దీంతో ఈ సీజన్‌లో రైతులు దూది పూల వైపే మొగ్గు చూపుతున్నారు.

ఖరీఫ్‌లో విత్తనాల మార్కెట్టు సరళిని పరిశీలిస్తే అధికంగా పత్తివే అమ్ముడు పోయాయి. జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలే అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. పంటలకు అనుకూలమైన వర్షాలు పడుతుండటంతో కర్షకుల మోముల్లో ఆనందం కనిపిస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సాధారణ వర్షాపాతానికి మించి నమోదయింది. అయినా సాగునీటి వనరుల్లోకి ఆశించిన స్థాయిలో వర్షపునీరు చేరలేదు. అయినా ఈ వర్షాలు సాగుకు అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతమైన రామన్నపేట, వలిగొండ, బీబీనగర్, పోచంపల్లి, చౌటుప్పల్, భువనగిరి మండలాల్లో వరినాట్లు అధికంగా వేస్తున్నారు. రాజపేట, ఆలేరు, తుర్కపల్లి, బొమ్మలరామారం, యాదగిరిగుట్ట మండలాలో చాలామంది రైతులు పత్తిని నాటుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 1.16 లక్షల హెక్టార్ల వరకు వివిధ పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఇది గతేడాది ఖరీఫ్ సీజన్ కన్నా దాదాపు 20 వేల హెక్టార్లు అధికం. ఇప్పటికే సుమారు 33 వేల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు వాటిలో పత్తి 24,557 హెక్టార్లుదే అధికంగా ఉంది. జిల్లా అధికారుల అంచనా ప్రకారం 60 వేల హెక్టార్లలో పత్తి సాగు కానున్నట్లు తేలింది. ఇప్పటికే దాదాపు 45 శాతం మేర పత్తి వేసేశారు. అపరాల సాగుకు రైతులు మొగ్గుచూపడంలేదు. ఇప్పటి వరకు కందులు 86 హెక్టార్లు, పెసర 60 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మొక్కజొన్న 1,396 హెక్టార్లలో విత్తనాలు చల్లినట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఈనెల ఆరంభం నుంచి కురుస్తున్న వర్షాలు రైతులకు వూరట కలిగిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి నేటి వరకు ఒక మోస్తరు వానలు పడుతునే ఉన్నాయి. జిల్లాలోని నూతన మండలాలతో కలిపి 16 మండలాలు ఉండగా, వాటిలో 11 మండలాల్లో అధికంగా వర్షాలు కురిశాయి. బొమ్మల రామారం మండలంలో లోటు కనిపిస్తుండగా.. తుర్కపల్లి, ఆలేరు, మోటకొండూరు, యాదగిరిగుట్ట మండలాల్లో సాధారణ వర్షపాతమే నమోదయింది. జిల్లావ్యాప్తంగా తీసుకుంటే సాధారణంగా కురవాల్సిన దానికంటే 64.5 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్లలో చౌటుప్పల్‌లో అధిక వర్షపాతం నమోదైంది. 5 మండలాల్లో 486 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 1107 మి.మీ. కురిసింది. ఇది సాధారణం కన్నా.. 127 శాతం అధికం. భువనగిరి రెవెన్యూ డివిజన్ సాధారణ వర్షపాతం 1256 మి.మీ. కాగ నేటికి 1774. మి.మీ వాన కురిసింది. చౌటుప్పల్‌తో పొల్చితే.. భువనగిరిలో 40 శాతం అధికంగా వర్షం కురిసింది. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆటోమేటిక్ యంత్రాల ద్వారా వర్షపాతాన్ని కొలుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో రైతులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. చాలా మంది ఇప్పటికే విత్తనాలు, ఎరువులు సమకూర్చుకున్నారు. విత్తనాలు విత్తుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని 80 శాతం అన్నదాతలు వరినారుమడులు సిద్ధం చేసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఏకీకృత పన్ను విధానంలో ఎరువులను మొదట 18 శాతం శ్లాబులో చేర్చడంతో అధిక భారం పడుతుందని అన్నదాతలు ఆందోళన చెందారు. దీనిని జీఎస్టీ కౌన్సిల్స్ 18 శాతం నుంచి మినహాయించి 5 శాతం శ్లాబులో చేర్చడంతో స్వల్పంగా ధరలు తగ్గే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. 50 కేజీల యూరియా బస్తాకు రూ.0.71 పైసలు తగ్గుతాయని కేంద్రం ప్రకటించగా.. ఆ విషయాన్ని రాష్ట్రంలోని అధికారులు ధ్రువీకరించలేదు. దీనిపై సందిగ్ధం కొనసాగుతోంది.

## 12 నుంచి మూడో విడత హరితహారం

వడ్డేపల్లి: రాష్ట్రవ్యాప్తంగా జులై 12 నుంచి మూడో విడత హరితహారం కార్యక్రమం ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ తెలిపారు. జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కిట్ పథకం ప్రారంభించి నెలరోజులు పూర్తయిందని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య 30 నుంచి 50 శాతం పెరిగిందని ఈ సంఖ్య ఇంకా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 2100 పోస్టులు భర్తీ చేసేందుకు అనుమతించామని త్వరితగతిన ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. రైతు సమగ్ర సర్వేను వంద శాతం పూర్తి చేసి ఈ నెల ఆరో తేదీలోగా నివేదిక అందజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఎరువులు, విత్తనాలు కొరతలేకుండా పక్కాప్రణాళిక రూపొందించి అమలు చేసినందుకుగాను కలెక్టర్లను అభినందించారు. ఈనెల 12 నుంచి మూడో విడత హరితహారం మొదలవుతున్నందున నిర్దేశించిన లక్ష్యంతో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశిం చారు. కళాజాతాల ద్వారా హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గొర్రెల కొనుగోలులో కలెక్టర్లకు ఎదురవుతున్న సమస్యలు గురించి సీ.ఎస్ అడిగి తెలుసు కున్నారు. సాదాబైనామాకు అర్హత కలిగిన దర ఖాస్తులను పరిష్కరించి మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఈ సమావేశంలో వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల కలెక్టర్లు ఆమ్రపాలి, ప్రశాంత్ జీవన్‌పాటిల్, సంయుక్త కలెక్టర్లు ఎస్.దయానంద్, హరితలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఉపాధిహామీలో భారీగా

## ఉద్యోగులకు స్థానచలనం

పాలమూరు: ఉపాధి హామీ పథకంలో భారీగా ఉద్యోగులను కలెక్టర్ రొనాల్డ్‌రోస్ బదిలీ చేశారు. గత కొన్నేళ్ల నుంచి వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధి హామీ మండల ఏపీవోలు, ఈసీలను బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలోని 21 ఎంపీడీవో మండలాల పరిధిలోని 17 మండలాల ఉపాధి అధికారులను (ఏపీవో) బదిలీ చేయడం విశేషం. అంతేకాకుండా 12 మండలాల ఉపాధి హామీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ)లను కూడా బదిలీ చేశారు. అనేకేళ్ల నుంచి ఒకే దగ్గర పని చేస్తున్న ప్రాంతాల నుంచి మరో ప్రాంతానికి వారిని బదిలీ చేసినట్లు మహబూబ్‌నగర్ డీఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి న్యూస్‌టుడేకు వివరించారు. ఏపీవోలలో ఇద్దరు, ఈసీలలో ముగ్గురు నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి కూడా మండలాలు కేటాయించినట్లు వివరించారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి.

